క్లుప్తంగా

హామీల అమలులో విఫలం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. మండల పరిధిలోని నిర్దవెళ్లిలో గురువారం వ్యవసాయ సంఘం అధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద మహిళలకు 2500లను ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులు, కూలీలను విస్మరిస్తోందని ఆయన ఆరోపించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లాలయ్య, ఉపాధ్యక్షులుగా జయమ్మ, చెన్నమ్మ, కార్యదర్శులుగా మల్లేశ్, శంకర్, కోశాధికారిగా లక్ష్మమ్మను ఎంపిక ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

షాద్‌నగర్: మున్సిపాలిటీలో వంద రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని బ్రిలియంట్ పాఠశాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాచరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సాయిబాబ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ జావిద్, ఆర్‌ఐలు ప్రియాంక, రోహిత్, రమేశ్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

శంకర్‌పల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోగా.. 9మందికి కంటి ఆపరేషన్ అవసరమున్నట్లు వైద్యులు గుర్తించారు. వీరికి త్వరలోనే చికిత్స అందించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ యోగేశ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ వాసులు, వైద్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

శంకర్‌పల్లి: అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీలోని 11వ వార్డులో రూ.31.45 లక్షల మున్సిపల్ నిధులతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మండల పరిధిలోని రాసుమల్లెగూడలో గురువారం వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రూ.45లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్లు, రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు, నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా నాగులపల్లిలో రూ.35లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శివరాములు, రాజేశ్‌రెడ్డి, వెంకటయ్య, రాఘవేందర్, ప్రవీణ్, రవి, రవీందర్, శ్రీను, నరేందర్, వెంకటేశ్, దర్శన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాటుడెందుకో.. నరుకుడెందుకో..

- గ్రామాల్లో రోడ్డుకిరువైపులా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు



జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్‌లో నరికిన చెట్లు



ఉత్తరాసిపల్లిలో నరికివేసిన చెట్లు

కొందుర్గు: ప్రతినిత్యం అధికారులు, నాయకులు గ్రామాల్లో మొక్కలు నాటుతూ ఫొటోలకు ఫోజిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేయడం చూస్తునే ఉంటాం. ఈ మొక్కలు ఎందుకు నాటుతారో.. ఎంత ఖర్చుచేస్తే మొక్కలు ఎదుగుతాయో వారికి తెలియదా మరీ. ఎన్ని మొక్కలు నాటుతారో అంత కన్నా రెట్టింపుగా ప్రతి రోజు ఏదో ఒక గ్రామంలో ఏపుగా పెరిగిన చెట్లను నరుకుతున్నారు. కరెంటు తీగల కింద ఉన్నాయని, పైపులైన్‌కు అడ్డంగా ఉన్నాయని కారణంతో చెట్లను నరుకుతున్నారు. ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుచేసి మొక్కలను పెంచి, మూడేళ్ల వరకు సంరక్షణ ఖర్చులు వెచ్చించినా, పెరిగి పెద్దయ్యాక చెట్లను నరకడం విచిత్రంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని ముట్పూర్, ఉత్తరాసిపల్లి, జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్, చౌదరిగూడ గ్రామాల్లో ఏపుగా పెరిగిన మొక్కలను విద్యుత్ శాఖ సిబ్బంది కరెంటు తీగల కింద ఉన్నాయని నరికివేశారు. మొక్కలు నాటే సమయంలో అధికారులకు ఈ విషయం తెలియదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా సొమ్ము ఇలా దుర్వినియోగం చేయడమేమిటనీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



మాట్లాడుతున్న బాబయ్య

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో మండల అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని మోదీ పాలన రామరాజ్యాన్ని తలపిస్తుందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి దోచుకోవడం, దాచుకోవడం మాత్రమే తెలుసని, ప్రజల సంక్షేమం, అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజలు చైతన్యవంతులయ్యారని, ఇప్పటి నుంచి కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చెల్లవన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. 11 ఏళ్ల పాలనలో ప్రధాని మోదీ పేద వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని, దళితుల ఓట్లు తప్పా వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళిత సామాజిక వర్గంలో ఎంతో మార్పు వచ్చిందని, ప్రత్యక్ష ఎన్నికల్లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను ఓడగొట్టిన కాంగ్రెస్‌కు ఆయన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సమావేశంలో నాయకులు శివశంకర్, కృష్ణ, శ్రీశైలం, యాదగిరి, రమేశ్, వెంకటేశ్, యాదగిరిగౌడ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పాఠశాలల కమిషనర్‌కు సన్మానం



నవీన్ నికోలస్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర పాఠశాలల కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎడ్యుకేషన్ నవీన్ నికొలస్‌ను ఎస్టీఎఫ్ రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు, యూ.పోచయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తెలియపరుస్తూ.. ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌ల పోస్టులకు ప్రమోషన్‌లు కల్పించాలని కమిషనర్‌ను కోరారు. విద్యా సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి

ఎంపీడీఓ బన్సీలాల్



లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ బన్సీలాల్ సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తుందన్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను తొందరగా పూర్తి చేసి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అందుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, డబ్బులు నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోనే జమ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే బేస్మెంట్ లెవల్ నిర్మాణం పూర్తి చేసిన వారికి రూ.1లక్ష, స్లాబ్ లెవల్ గోడలు పూర్తి చేసిన వారికి రూ.1లక్ష చొప్పున బిల్లులు లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని పక్కా ఇల్లును నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెంది మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్, కారోబార్ శివకుమార్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు ఖరారు చేయాలి

మొయినాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కొందరు పైరవీలతో రిజర్వేషన్లు పొందాలని చూస్తున్నారని మండల బీసీ సంఘం సభ్యుడు కటుకూరి చిరంజీవి ఆరోపించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన అమ్డాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కొందరు ప్రజాప్రతినిధులు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అనుకూలంగా రిజర్వేషన్లు తీసుకొచ్చే విధంగా పైరవీలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ పరంగా అవకాశం కల్పించాలన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్‌లో 2006 ఓట్లు ఉండగా అందులో బీసీలే 915 మంది ఉన్నారన్నారు. కానీ నేటికీ బీసీలకు ఇప్పటి వరకు రిజర్వేషన్ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రిజర్వేషన్‌లపై పునరాలోచన చేసి జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు ఖరారు చేయాలని కోరారు. పైరవీలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అణగారిన వర్గాల ప్రజలు అధికారంలోకి వచ్చేందుకు అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీసీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్‌లను ఖరారు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నేడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

మొయినాబాద్: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు మండల స్థాయి ఎంపిక శుక్రవారం మొయినాబాద్‌లో జరుగుతుందని మండల విద్యాధికారి మల్లయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2016 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగస్టు 30 మధ్యకాలంలో జన్మించి 8-9 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు 4వ తరగతిలో ప్రవేశాల కోసం మొయినాబాద్‌లోని ఎంఆర్‌సీహెచ్ పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలని, 10 గంటల నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ నీరజ 9985231834, పీఈటీ ధనలక్ష్మి 9676339941 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

చేవెళ్ల: చదువుతోనే విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని చేవెళ్ల లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త, అర్చకుడు శ్రీపాద్ అన్నారు. మండలంలోని గొల్లపల్లి, ధర్మసాగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం దాత అర్చకుడు శ్రీపాద్ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యతోనే విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొందుర్గు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు రాష్ట్రానికి అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకే ఇళ్లు కట్టించడం సరికాదన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో బాబయ్య మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్యగౌడ్, శివారెడ్డి, బల్వంత్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

చేవెళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీగా ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా ఇప్పటివరకు కార్మికులకు కనీసం గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికులకు 16,600ల వేతనం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే నివరధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, కార్యదర్శి నరేశ్, యూనియన్ నాయకులు దస్తగిరి, జనార్దన్, నర్సింహ భాస్కర్, రఫీ, మున్సిపల్ కార్మికులు తదితరులు ఉన్నారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందితులకు చట్టప్రకారం చర్యలు తప్పవని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలోని పాలకులు రాష్ట్ర వ్యాప్తంగా పలువురి నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేయించారన్నారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరిస్తూ గత పాలకులు స్వార్థ రాజకీయాలకు పాల్పడి, ప్రజా జీవితాలకు భంగం కలిగే విధంగా వ్యవహరించారన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎంతో దుర్మార్గమైనదని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. చట్ట ప్రకారం నిందితులపై చర్యలు తప్పవన్నారు. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి జోక్యం చేసుకోదన్నారు. ఎంతో విశ్వాసంతో అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందని, కానీ గత ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఆయన వాడుతున్న బాషను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, చెన్నయ్య, జంగ నర్సింహ, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, పురుషోత్తంరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఒకరికొకరూ తినిపించుకున్నారు. అనంతరం పేదలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు.



మొయినాబాద్: రక్తదాన శిబిరంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



చేవెళ్ల: ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



షాబాద్: ప్రభుత్వ ఆస్పత్రిలో..

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

మండల వ్యవసాయ అధికారి శిరీష



విత్తనం బ్యాగ్‌పై గడువు తేదీని పరిశీలిస్తున్న ఏఓ శిరీష

కేశంపేట: ఫర్టిలైజర్ షాపుల్లో నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి శిరీష దుకాణదారులకు సూచించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఉన్న స్టాక్‌తో పాటుగా లైసెన్స్ వివరాలు, గోదాంల సమాచారాన్ని, ధరల పట్టీలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువకు విక్రయించొద్దన్నారు. నిషేధిత విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల గడువు తేదీని పరిశీలించి విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్స్‌ల రద్దుతో పాటుగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



షాబాద్: రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ అన్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దండు రాహుల్‌గుప్తా, చేవెళ్ల స్వామి, గౌరీశ్వర్, సూర్యగౌడ్, రాఘవేందర్, సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేశంపేట మండలంలో..

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, సంగెం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ అజాంఅలీ, నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్ఐలు నివేధిత, చెన్నకేశవులు, సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్, గ్రామస్తులు అబ్బి సుందరయ్య, ఇబ్రహీం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో..

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్, సురంగల్‌లో గురువారం తహసీల్దార్ గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆర్ఐ రాజేశ్, రెవెన్యూ సిబ్బంది మహేందర్, ఎల్లయ్య, బాలకృష్ణ, హరీష్, మహేశ్, నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదగిరి చారి, శ్రీధర్‌రెడ్డి, భూపాల్‌యాదవ్, రమేశ్‌గౌడ్, ఓంప్రకాశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, వెంకటయ్య, అంతయ్య, యాదయ్య పాల్గొన్నారు.

44 ఫిర్యాదులు..

చేవెళ్ల: మండలంలోని రావులపల్లి, ఈర్లపల్లి, నాంచేరి, నౌలాయపల్లి గ్రామాల్లో గురువారం తహసీల్దార్ కృష్ణయ్య, నయాబ్ తహసీల్దార్ రాజేందర్ అధ్వర్యంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం నాలుగు గ్రామాల్లో 44 ఫిర్యాదులు వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమలో ఆయా గ్రామాల నాయకులు రాజశేఖర్, రాంచంద్రయ్య, శ్రీనివాస్, నరేందర్, ప్రశాక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి



రాంసిగ్‌తండాలో జీవాలకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: జీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని హైతాబాద్‌తండా, రాంసిగ్‌తండాలో జీవాలకు చిటుక వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 900 గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. తొలకరి వర్షాలకు జీవాలు లేత పచ్చని గడ్డి తినడంతో క్లాస్టీడియా బ్యాక్టీరియా కడుపులోకి చేరి అనారోగ్యానికి గురై మృతువాతపడే అవకాశం ఉందన్నారు. చిటుక వ్యాధి రాకుండా జీవీలకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. రైతులు, పశుపోషకులు తమ జీవాలను టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది బాల్‌రాజ్, శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు.